క్లుప్తంగా

పీహెచ్‌సీ తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డీఐఓ

గాండ్లపెంట: జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) శ్రీనివాసరెడ్డి బుధవారం గాండ్లపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఇమ్యునైజేషన్ రికార్డులు, సిబ్బంది హాజరు పరిశీలించారు. మందుల నిల్వ, చిన్నారుల వ్యాక్సినేషన్, ఓపీ సేవలు తదితర అంశాల గురించి వైద్యాధికారి బాబాఫక్రుద్దీన్‌ను అడిగి తెలుసుకున్నారు. డీఐఓతో పాటు కదిరి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగేంద్రనాయక్ పాల్గొన్నారు.

తీరిన నీటి సమస్య

పుట్టపర్తి: బుక్కపట్నం పాత ఎస్సీ కాలనీలో బుధవారం బోరు ఏర్పాటుకు సర్పంచ్ నాగలక్ష్మి కొబ్బరి కాయ కొట్టి శ్రీకారం చుట్టారు. నీరు పుష్కలంగా పడటంతో కాలనీలో నీటి సమస్య పూర్తిగా తీరిందని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యాలుగా రాణించాలి


హ్యాండ్‌వాష్ యూనిట్ ప్రారంభిస్తున్న సాయిరాం ట్రస్ట్ సభ్యులు, ముఖ్య అతిథులు

ఎన్‌పీకుంట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న వారు మట్టిలో మాణిక్యాల వలె ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వక్తలు ఆకాంక్షించారు. సాయిరాం మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు సీఎం సాంబశివారెడ్డి తన కుమారుడు సీఎం సాయిరాంరెడ్డి వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యార్థుల కోసం లక్ష రూపాయలు వెచ్చించి 16 కుళాయిలతో కూడిన హ్యాండ్‌వాష్ యూనిట్ ఏర్పాటు చేయించారు. బుధవారం హ్యాండ్‌వాష్ యూనిట్‌ను ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓ సుబ్బిరెడ్డి, ఎస్ఐ వలిబాషా, సీఎం సాంబశివారెడ్డి హాజరయ్యారు. అనంతరం ట్రస్ట్ సభ్యులకు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపి, సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ట్రెజరర్ సీఎం వెంకటరమణమ్మ, ప్రధానోపాధ్యాయురాలు శిరీషారెడ్డి, రామాంజులుయాదవ్, రహీం, రమణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై నిరసన


సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చింది. అధికారులకు ఎన్నిసార్లు తెలిపినా పట్టించుకోకపోవడం లేదని కాలనీవాసులు ఆందోళనకు దిగారు. టీడీపీ నాయకుడు జక్కంపూటి నాగభూషణ ఆధ్వర్యంలో బుధవారం బత్తలపల్లి సచివాలయం వద్ద మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. అధికారులు కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. కాలనీకి అరకొరగా నీరు వస్తోందని, వేసవి ప్రారంభంలోనే సమస్య తీవ్ర రూపం దాలుస్తోందని ఎంపీడీ నరసింహనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్, సచివాలయ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి నారాయణ స్వామి మాట్లాడుతూ వారం రోజుల్లోపు ఎస్సీ కాలనీలో నీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. గడువులోపు పరిష్కరించకపోతే ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

భూ వివాదంపై విచారణ


అర్జీదారు సమస్య వింటున్న ఆర్డీఓ సువర్ణ

నల్లమాడ: భూ వివాదంపై అందిన ఫిర్యాదు మేరకు గోపేపల్లి రెవెన్యూ పొలం సర్వే నంబర్ 129, 130లో భూమిని తహసీల్దార్ రంగనాయకులు, వీఆర్‌ఓ మాలిక్‌తో కలిసి పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ పరిశీలించి, విచారణ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకోగా.. పలువురు తమ సమస్యలను ఆర్డీఓకు విన్నవించారు. గతంలో తనకు రెడ్డిపల్లి రెవెన్యూ పొలంలో 2.88 ఎకరాల భూమికి పట్టా ఇచ్చారని.. ఇందుకు సంబంధించి భూ రికార్డుల కాపీ ఇవ్వాలని కోరితే అందుబాటులో లేవని చెబుతున్నారని పుల్లగూరపల్లికి చెందిన ఎం.అంజినప్ప ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. రికార్డు నకలు ఇప్పించాలని కోరారు.

పరీక్షలకు వేళాయె..

- మార్చి 1 నుంచి ఇంటర్
- 17 నుంచి టెన్త్ పరీక్షలు
- ప్రణాళికతో చదివితే విజయం


ఆసియా


ఎన్‌పీకుంట కేజీబీవీలో స్టడీ అవర్స్‌లో విద్యార్థినులు

ఎన్‌పీకుంట: పరీక్షల సీజన్ మొదలైంది. ఇంటర్ ప్రాక్టికల్స్ జరుగుతున్నాయి. థియరీ పరీక్షలు మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభమవుతాయి. అదే నెల 17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు మొదలవనున్నాయి. పరీక్షలలో ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో విద్యార్థులు అధిక సమయం కేటాయించి పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఉపాధ్యాయులు కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్ ద్వారా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. కదిరి నియోజకవర్గంలోని ఎన్‌పీ కుంట, గాండ్లపెంట, తనకల్లు, నల్లచెరువు, తలుపుల, కదిరి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 3,492 మంది విద్యార్థులు ఇంటర్, పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు దగ్గర పడుతున్న కొద్దీ విద్యార్థుల్లో ఆందోళన పెరిగిపోతుంది. ఇది ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారి డాక్టర్ ఆసియా పలు సూచనలు ఇచ్చారు.

పౌష్టికాహారం తీసుకోవాలి:

మంచి పోషక విలువలున్న ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చు. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి. నీరు ఎక్కువగా తీసుకోవాలి.

నిద్రకు సమయం కేటాయించాలి

తల్లిదండ్రులు తమ పిల్లలు పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలనే ఉద్దేశంతో అర్ధరాత్రి వరకు చదివిస్తారు. విద్యార్థులు కూడా నైట్ అవుట్ అంటూ తెల్లవార్లూ చదువుతుంటారు. దీని వల్ల విద్యార్థికి లాభం కంటే నష్టమే జరుగుతుంది. ప్రణాళికతో చదవడం అలవాటు చేసుకోవాలి. రాత్రి సమయంలో త్వరగా పడుకొని, వేకువజామునే నిద్రలేచి చదివితే ఫలితం ఉంటుంది. నిద్రకు కనీసం ఆరు గంటల సమయం కేటాయించాలి.

సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి

పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు ముఖ్యంగా సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి. సెల్‌ఫోన్.. ఏకాగ్రతను దెబ్బతీస్తుంది. ఆందోళన, ఒత్తిడిని అధిగమించి ఏకాగ్రతతో చదివితే తప్పకుండా విజయం వరిస్తుంది.

కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి


ధర్మవరం కేజీబీవీలో విద్యార్థినులకు కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడిమర్రి: సున్నితమైన కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని వైద్యాధికారి హరిత విద్యార్థులకు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో బుధవారం ఆమె విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. గతంలో మండలంలోని పలు గ్రామాల్లోని కంటి పరీక్షలు చేయించుకుని అద్దాల కోసం ఎంపికైన 60 మంది విద్యార్థులకు బుధవారం పంపిణీ చేసినట్లు చెప్పారు. కంటి చూపును మెరుగు పరుచుకోవడానికి క్యారెట్, ఆకుకూరలు, పాలు, గుడ్లు, చేపలు తదితర పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఉదయం లేవగానే చల్ల నీటితో కళ్లను శుభ్రం చేసుకోవాలన్నారు. పగలు అంతా అలసిపోయిన కళ్లను నిద్రపోవడానికి ముందు చల్లని నీటితో శుభ్రం చేసుకుంటే కళ్లు ఎంతో ఆరోగ్యంగా ఉంటాయని ఆమె సూచించారు. చీకటిలోను, తక్కువ వెలుతురు ఉన్న ప్రదేశాల్లో చదువుకోరాదన్నారు. అలా చేస్తే కళ్లపై అధిక ఒత్తిడి పడి చూపు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ అధికారి సికిందర్, ఎంఈఓ కృష్ణమోహన్, హెచ్‌ఎం అరుణ, ప్రిన్సిపాల్ వాణిశ్రీ, ఆరోగ్య కార్యకర్త జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని కేజీబీవీ విద్యార్థినులకు బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్, డాక్టర్ పుష్పలత, ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ధర్మవరం మండలంలోని అన్ని స్కూళ్లలో కంటి పరీక్షలను నిర్వహించినట్లు చెప్పారు. అందులో అవసరమున్న వారికి కంటి అద్దాలు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం శివమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ అనిత, ప్రిన్సిపాల్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

బత్తలపల్లి: ఎన్నికల హామీ మేరకు గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు 3 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఐ జంగంమఠం కాలనీలో పేదలతో సమావేశం ఏర్పాటు చేశారు. మండల కార్యదర్శి బండల వెంకటేష్ అధ్యక్షత వహించగా, నియోజకవర్గ కార్యదర్శి మధు, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, దళితుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడారు. పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, నిర్మాణానికి సాయం అందించాలని కోరారు. రైతు సంఘం మండల అధ్యక్షులు సత్తెప్ప, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బత్తల నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి


ధర్మవరంలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తలుపుల : ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు ఛత్రపతి శివాజీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఓటమి ఎరుగని పోరాట యోధుడు ఛత్రపతి అని, ఆయన స్ఫూర్తితో యువత దేశం కోసం, ధర్మం కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, విశ్వకర్మ యోజన జిల్లా కో కన్వీనర్ గోవర్ధన్, ఆర్ఎస్ఎస్ మండల సేవక్ శ్రీరాములు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సాలేవీధిలోనున్న శ్రీ అంబా భవాని ఆలయంలో బుధవారం ఛత్రపతి శివాజీ 398వ జయంతి వేడుకలను ఛత్రపతి శివాజీ మహారాజ్ మరాఠా సంఘం, స్వకుల సాలె సంఘం , ఆలయ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబాభవానికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పురవీధుల్లో బైక్ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో స్వకుల సాలె సంఘం నాయకులు సరోదే కృష్ణమూర్తి, జుజారు నాగరాజు, కాంలే లక్ష్మణరావు, సరోదే భుజంగరావు, సునీల్, ఈశ్వర్, మరాఠా సంఘం సభ్యులు హరి, ప్రకాష్‌రావు, పెద్ద వెంకటేష్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జుజారు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి


దరఖాస్తులు చేతపట్టుకుని నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు, నిరుపేదలు

ఎన్‌పీకుంట: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి రమణ ఆధ్వర్యంలో వంకమద్ది క్రాస్ వద్ద నిరుపేదలతో కలిసి ఇళ్లపట్టాల దరఖాస్తులు చేతపట్టుకుని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా ఎన్నికల మేనిఫెస్టోలోని ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ పరిధిలో రెండు సెంట్ల చొప్పున అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, నిర్మాణం కోసం రూ.5లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. వంకమద్ది క్రాస్ వద్ద గల సర్వే నంబరు 395–1లో 31.28 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అందులో ఇళ్లు నిరుపేదలకు నివేశన స్థలాలు మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులకు కోరామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కదిరప్ప, సహాయ కార్యదర్శి రమణ, సూర్యనారాయణరెడ్డి, గంగులు, ఆదిలక్ష్మమ్మ, డీహెచ్‌పీఎస్ కార్యదర్శి అంజనబాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి శేషం మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సులభతర బోధన కోసమే 'జ్ఞాన జ్యోతి'


మాట్లాడుతున్న ఏపీసీ ప్రొఫెసర్ దేవరాజ్

బత్తలపల్లి: చిన్నారులకు ఆటపాటలతో కూడిన సులభతరమైన బోధన కోసమే అంగన్‌వాడీ కార్యకర్తలకు 'జ్ఞానజ్యోతి' పేరిట శిక్షణ ఇస్తున్నట్లు సమగ్ర శిక్ష జిల్లా అదనపు పథక సమన్వయకర్త (ఏపీసీ) ప్రొఫెసర్ దేవరాజ్ పేర్కొన్నారు. జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా బత్తలపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. శిక్షణలో గత రెండు రోజులుగా నేర్చుకున్న విషయాలపై హాజరైన వారిని అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీలకు ప్రతి అంశాన్నీ పూర్తిగా నేర్పించాలని రిసోర్స్ పర్సన్స్ నాగేశ్వరయ్య, నాగశేషణ, రామసుబ్బారెడ్డిలకు సూచించారు. శిక్షణలో తయారు చేసిన టీచింగ్ మెటీరియల్స్‌ను చూసి.. వాటిని తయారు చేసిన వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఎంఈఓలు చాముండేశ్వరి, సుధాకర్‌నాయక్, ప్రధానోపాధ్యాయులు జయంతి, సిఆర్‌యంటిలు సునీత, వెంకటరమణ, గోవిందరెడి హాజరయ్యారు.

పుట్టపర్తి/ ఎన్‌పీకుంట: జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లకు ఇస్తున్న 'జ్ఞాన జ్యోతి' శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కోర్స్ డైరెక్టర్, పుట్టపర్తి ఎఈఓ–2 బొల్లె ప్రసాద్ పేర్కొన్నారు. ఆయన బుధవారం పుట్టపర్తి శివాలయం వీధి ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. శిక్షణ తీరు తెన్నులను పరిశీలించారు. ప్రసాద్ మాట్లాడుతూ ఈ శిక్షణ వల్ల చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యం, ఆహార నియమాలు, పరిశుభ్రత లాంటి విషయాలు అవగతం చేసుకునేందుకు దోహదపడుతుందన్నారు. చిన్నారులకు ఆటపాటల ద్వారా విద్య నేర్పేందుకు మంచి తరీఫ్రదులాంటిదన్నారు. గ్రామ స్థాయిలో సామాజిక చైతన్యంతో పాటు మూఢనమ్మకాలను, బాల్య వివాహాలను రూపుమాపవచ్చన్నారు. చిన్నారుల్లో స్నేహపూర్వక వాతవరణం నెలకొల్పవచ్చన్నారు. హెచ్‌ఎం రజనీకాంత్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్స్ రాంప్రసాద్, నరేశ్, మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎన్‌పీకుంట: జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సూచించారు. ఎన్‌పీకుంటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లకు 'జ్ఞానజ్యోతి' కార్యక్రమంపై రెండో రోజు బుధవారం శిక్షణ తరగతులు కొనసాగాయి. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, డీఆర్‌పీలు, రిసోర్స్ పర్సన్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వే నిష్పక్షపాతంగా నిర్వహించండి


సర్వేపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బత్తలపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న పబ్లిక్, ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్ (పీ4) సర్వేను నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఎంపీడీఓ నరసింహనాయుడు పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పీ4 సర్వేపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంపిక చేసిన ఇళ్లకు గురువారం సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు వెళ్లి సర్వే నిర్వహించాలన్నారు. ముఖ్యంగా సమాజంలో ఆర్థికంగా అగ్రస్థానంలో ఉన్న పది శాతం మందికి అట్టడుగున ఉన్న 21 శాతం మందికి చేయూతనివ్వడానికి 27 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళితో ఎంపిక చేసిన ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహించాలన్నారు. అనంతరం సర్వే ఎలా చేపట్టాలో ఏఎస్‌ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ వివరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ క్రిష్టప్ప, ఏఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా శ్రీనివాసరెడ్డి



కదిరి అర్బన్: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా చెరువు శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల అధికారి సోమసుందర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తానని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శ్రీనివాసరెడ్డి ఎంపికపై పలువురు జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజాప్రతినిధులకు సమాచారం తెలపరా?


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: గ్రామాల్లో మహిళా రైతులతో సంఘాలు ఏర్పాటు చేసే విషయం ప్రజాప్రతినిధులకు తెలపరా అంటూ వెలుగు ఏపీఎం లక్ష్మీనారాయణను ఎంపీపీ రమణారెడ్డి, సభ్యులు నిలదీశారు. బుధవారం ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ మహిళా రైతులతో సంఘాలు ఏర్పాటు చేసి రుణాలు అందజేస్తారని తెలిపారు. ఎంపీపీ, సభ్యులు మాట్లాడుతూ తమకు ఇటువంటి సమాచారం ఇంత వరకు తెలపలేదని ప్రశ్నించారు. లబ్ధిదారులు పక్కాగృహాలు నిర్మించుకోకపోతే రద్దవుతాయని సంబంధిత అధికారి తెలిపారు. ఉద్యానశాఖలో సబ్సి కూలర్స్ వస్తాయని, రైతులు దరఖాస్తు చేసుకోవాలని హెచ్‌ఓ నవీన్‌కుమార్ సూచించారు. పుట్టపర్తి నుంచి నిడిమామిడికి ఆర్టీసీ బస్సు తిప్పాలని కో ఆప్షన్ మెంబర్ మాబూసాబ్ కోరారు. సర్పంచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ అటవీ గ్రామాల్లో సెల్ టవర్ పని చేయక పోవడంతో సబ్సిడీ డ్రిప్పు, స్ప్రింక్లర్లకు దరఖాస్తు చేసుకున్నా జియో ట్యాగ్ పని చేయక పోవడంతో వృథా అవుతున్నాయని, మాన్యువల్‌గా ఇచ్చేలా ఏర్పాటు చేయాలని కోరారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సభ్యులు కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీనరసమ్మ, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, ఏపీఎం మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్తతో సంపద సృష్టిద్దాం


సంపద కేంద్రం వద్ద శిక్షణ ఇస్తున్న అధికారులు

నల్లచెరువు: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా చెత్త సంపద కేంద్రాల నిర్వహణపై తనకల్లు, ఎన్‌పీ కుంట, గాండ్లపెంట, నల్లచెరువు, తలుపుల, కదిరి మండలాల పంచాయతీ అధికారులకు డీఎల్‌పీఓ అంజినప్ప, నల్లచెరువు ఈఓఆర్డీ శకుంతల, సర్పంచ్ పంచరత్నమ్మ ఆధ్వర్యంలో బుధవారం ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. చెత్తతో సంపద సృష్టించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని చెత్త సంపద కేంద్రాన్ని అధికారులు సందర్శించారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు తడి, పొడి చెత్త వేరు చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు.

సంక్షిప్త సమాచారం

ముగిసిన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు

ముదిగుబ్బ: గుంజేపల్లి సమీపంలో కన్యకలగొందిలో బుధవారం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు ఘనంగా ముగిశాయి. ధర్మవరానికి చెందిన చౌటిపల్లి వేణుగోపాల్ కన్యకలగొందిలో నూతనంగా దేవాలయం నిర్మించిన విషయం విదితమే.

వ్యక్తిపై దాడి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని దుర్గానగర్‌కు చెందిన పామిడి పవన్‌కుమార్ అనే వ్యక్తిపై రోషన్, ఇర్ఫాన్ మరికొంతమంది దాడి చేశారు. పవన్ కుమార్ బైక్ రోషన్ బైక్‌కు తగిలిందన్న కారణంతో ఈ దాడి జరిగింది. గాయపడిన పవన్‌కుమార్‌కు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

ఆటో యూనియన్ ఏర్పాటు

పుట్టపర్తి టౌన్: ప్రశాంతి రైల్వేస్టేషన్ వద్ద సీఐటీయూ అనుబంధ ఆటో యూనియన్ ఏర్పాటు చేశారు. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా పైపల్లి గంగాధర్, అధ్యక్షులుగా సాకే మాధవ, ఉపాధ్యక్షులుగా సుధాకర్, అన్వేష్, కార్యదర్శులుగా సరేష్, నాగరాజు, కోశాధికారిగా లక్ష్మీపతి ఎన్నుకొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలి

కదిరి టౌన్: సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇనాయతుల్లా కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకపోతే దశలవారీగా ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

గాండ్లపెంట: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి జేకే మెడికల్ స్టోర్ వద్ద నిలిపి ఉన్న ద్విచక్రవాహనం (స్కూటీ) అపహరణకు గురైంది. ఈ మేరకు బాధితుడు బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

త్రీఫేజ్ విద్యుత్ వేళల్లో మార్పులు

అమడగూరు: అమడగూరు, కొట్టువారిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో గురువారం, శుక్రవారం వ్యవసాయానికి సంబంధించి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేసినట్లు ఏఈ చంద్రానాయక్, అమడగూరు లైన్‌మెన్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. తుమ్మల, గుండువారిపల్లి పంచాయతీలకు అర్ధరాత్రి ఒంటి గంట నుంచి ఉదయం 9 గంటల వరకు, చినగానిపల్లి, గుండువారిపల్లి పంచాయతీలకు అర్ధరాత్రి 12 నుంచి ఉదయం 5 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు, అలాగే కస్సముద్రం పంచాయతీకి ఉదయం 5 నుంచి 9 గంటల వరకు, రాత్రి 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వ్యవసాయ మోటార్లకు త్రీఫేజ్ సరఫరా ఉంటుందన్నారు.


హంద్రీ–నీవా కాలువ సామర్థ్యం పెంచాలి

పుట్టపర్తి టౌన్: హంద్రీ–నీవా కాలువ సామర్థ్యం పెంచి చివరి ఆయకట్టు వరకు సాగునీరందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఆయకట్టుకు నీరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత మాట మారుస్తున్నారన్నారు. 10వేల క్యూసెక్కుల నీటి సామర్థ్యంతో కాలువ వెడల్పు చేసి, ఆరు లక్షల ఎకరాలకు సాగునీరందించాలని, 30 లక్షల మందికి తాగునీరందించాలని డిమాండ్ చేశారు.

సబ్సిడీ రుణాలకు నేడు ఇంటర్వ్యూలు

ధర్మవరం అర్బన్: స్వయం ఉపాధి సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, కాపు, మేదర, కుమ్మర కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మున్సిపల్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. ఒకటో వార్డు నుంచి 20వ వార్డు దరఖాస్తుదారులు ఉదయం 10 గంటలకు, 21 నుంచి 40వ వార్డుల దరఖాస్తుదారులు మధ్యాహ్నం 3 గంటలకు హాజరుకావాలని కోరారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు


బ్యాంక్ సేవలపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఎం

ధర్మవరం రూరల్: ఖాతాదారులకు కెనరా బ్యాంక్ మెరుగైన సేవలందిస్తోందని ఆర్‌ఎం మురళీమోహన్ తెలిపారు. బుధవారం ధర్మవరం కెనరా బ్యాంక్ అధికారులు బ్యాంక్ సేవలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వివిధ వర్గాల ఆర్థిక అభివృద్ధికి కెనరా బ్యాంకు అందిస్తున్న సేవలు, పథకాలపై ఆర్‌ఎం అవగాహన కల్పించారు. మేనేజర్ కార్తికేయన్ పాల్గొన్నారు.

క్రమపద్ధతిలో టీకాలు వేయండి

తలుపుల : గర్భిణులు, పిల్లలకు క్రమపద్ధతిలో టీకాలు వేయాలని డీఐఓ శ్రీనివాస్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. పులిగుండ్లపల్లిలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్రనాయక్‌తో కలిసి పరిశీలించారు.

చిరు వ్యాపారి బలవన్మరణం

- అప్పు ఇచ్చిన వారి నుంచి వేధింపులే కారణం

కదిరి టౌన్: పట్టణంలోని షేక్ మహమ్మద్ అజామ్ (29) బుధవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మున్సిపల్ పరిధిలోని రామిరెడ్డి కాలనీకి చెందిన షేక్ మహమ్మద్ అజామ్ నానాదర్గా సమీపంలో మటన్ కడ్డీలు వ్యాపారం చేసుకొని జీవనం సాగించేవాడు. అదే కాలనీకి చెందిన పఠాన్ ఫిరోజ్‌తో వ్యాపారం నిమిత్తం రూ.20 వేలు అప్పుతీసుకున్నాడు. సకాలంలో అప్పు చెల్లించనందుకు, మహమ్మద్ అజామ్‌ను ఫిరోజ్ రెండు రోజుల కిందట నానా దర్గా సమీపంలో దాడి చేశాడు. ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని అనడంతో 'నీ అంతు చూస్తా'నని బెదిరించాడు. అప్పటి నుంచి రోజూ ఫోన్‌చేస్తూ వేధించడంతో భరించలేక పోయిన అజామ్ బుధవారం సాయంత్రం ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఫిరోజ్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఎన్‌పీకుంట: పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థినులు మెరుగైన ఫలితాలు సాధించాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ రిహానా ఆకాంక్షించారు. స్థానిక కేజీబీవీలో బుధవారం విద్యార్థినులు సరస్వతి పూజ చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

స్వయం ఉపాధి రుణాలకు ఇంటర్వ్యూలు


తలుపులలో సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ, బ్యాంకు మేనేజర్లు

తలుపుల/ కదిరి అర్బన్/ అమడగూరు/ ముదిగుబ్బ/ పుట్టపర్తి టౌన్/ ఓడీచెరువు : బీసీ కార్పొరేషన్ రుణాల కోసం బుధవారం మండల పరిషత్ కార్యాలయాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. తలుపులలో 45 యూనిట్లకు 200 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కదిరి అర్బన్‌లో 320 మందికి గాను 230 మంది పాల్గొన్నారు. ఎన్‌పీకుంటలో 36 యూనిట్లకు 294 మంది దరఖాస్తు చేసుకోగా.. ఇంటర్వ్యూలకు 130 మంది మాత్రమే హాజరయ్యారు. అమడగూరులో 35 యూనిట్లకు 615 మంది దరఖాస్తు చేసుకోగా.. 334 మంది ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. ఓడీచెరువులో 327 మంది అభ్యర్థులకు గాను 172 మంది హాజరయ్యారు. ముదిగుబ్బలో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో దరఖాస్తుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎంపీడీఓలు, బ్యాంకు అధికారులు హాజరై అభ్యర్థుల దరఖాస్తులు, సర్టిఫికెట్లను పరిశీలించారు. ఇక పుట్టపర్తి మున్సిపల్ కౌన్సిల్ హాలులో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 234 మంది హాజరయ్యారు.